క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకొత్తపల్లి: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, దరఖాస్తు నింపి వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని సూచించారు.

పద్మశాలీ సంఘం సభ్యత్వ నమోదు

తాడూరు: రాష్ట్ర పద్మశాలీ సంఘం ఎన్నికల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శుక్రవారం నాయకులు ప్రారంభించారు. జిల్లా కన్వీనర్ తిరుపతయ్య మాట్లాడుతూ పద్మశాలీలను ఏకం చేసి సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పనిచేసే విధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం చేపట్టారు. అనంతరం మండల గౌరవాధ్యక్షుడు గంగినారాయణ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా నరేందర్, కార్యదర్శిగా బాలరాజు, వామనమూర్తిలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

29న సభను విజయవంతం చేయండి

చారకొండ: అచ్చంపేట నియోజకవర్గంలో మంత్రి హరీష్‌రావు రాక సందర్భంగా బీఆర్‌ఎస్ నిర్వహించే సభను నాయకులు భారీగా హాజరై విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. 29న అచ్చంపేట నియోజకవర్గంలో మంత్రి హరీష్‌రావు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

చెంచులకు వైద్య పరీక్షలు



మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని చెంచులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు మలేరియా అధికారి అశోక ప్రసాద్ తెలిపారు. అమ్రాబాద్ మండలంలోని సార్లపల్లి, కుడిచింతలబైలులో 117 మంది చెంచులకు సీజనల్ వ్యాధులతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దీపక్‌రాయ్, రాజీవ్, సూపర్‌వైజర్లు భాగ్యమ్మ, ఉమా, పల్లవి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తెలకపల్లి: ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఆవరణలో నెల రోజులుగా ఆర్‌ఎస్‌ఎస్ సేవా భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో చాలా మంది విద్యార్థులు వారి నైపుణ్యాన్ని పెంచుకున్నారన్నారు. ఇలాంటి ఉచిత శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాము, ఆంజనేయులు, శేఖర్, రామకృష్ణ, మల్లేష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



లింగాల: శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందాలని తహసీల్దార్ మునిరొద్దీన్ సూచించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రెండు నెలల పాటు చెంచు మహిళలకు కుట్టు శిక్షణ నిర్వహించగా శుక్రవారం 25 మంది మహిళలకు కుట్టు మిషన్లతో పాటు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఐటీడీఏ వారు అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన ఖుద్దూస్, నర్సింహాచారి కుటుంబ సభ్యులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, అశోక్‌చారి, మల్లిఖార్జున చారి, వెంకటేష్‌చారి, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండతండా, సున్నపుతండాలో ఎక్సైజ్, పోలీసు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి పది లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో పండుగ వాతావరణం

- ఘనంగా బొడ్రాయి, గ్రామ దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు

లింగాల: మండలంలోని అవుసలికుంటలో ఆరో రోజుల పాటు నిర్వహించే గ్రామ దేవత, బొడ్రాయి పున:ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. శక్తి పూజారి బైండ్ల గిరి బృందం శక్తి పూజల నడుమ పాత బొడ్రాయిని వెలికి తీశారు. రాత్రి పాత, కొత్తగా ఏర్పాటు చేసిన బొడ్రాయిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జలదివాసం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున శక్తి పూజల నడుమ పుష్పాదివాసం, క్షీరాధివాసం, మహాస్నానం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద మూడు కూడళ్ల కలిసే మార్గంలో ప్రతిష్ఠాపన చేశారు. బొడ్రాయి వద్ద భక్తులు శక్తి హోమాలు నిర్వహించారు. రాత్రి సర్వజనహిత బైండ్ల శక్తి పూజారులచే కథ కాలక్షేపం వినిపించారు. ఇదిలా ఉండగా కొన్ని ఏళ్ల తర్వాత గ్రామంలో బొడ్రాయి పండుగ నిర్వహించగా సందడి వాతావరణం నెలకొంది.

నేడు గ్రామ దిగ్బంధం

వేడుకల్లో భాగంగా శనివారం బొడ్రాయి వద్ద వివిధ రకాల శక్తి పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి గ్రామ దిగ్బంధన, పొత్తి కార్యక్రమం నిర్వహించనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాత్రి 7 గంటల వరకు గ్రామానికి వచ్చే వారందరూ చేరుకోవాలని తెలిపారు.



వెల్దండ మండలం అజిలాపూర్‌లో పూజలు చేస్తున్న గ్రామస్తులు

అజిలాపూర్‌లో బొడ్రాయి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో శీతలాంబదేవి బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ప్రారంభించారు. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రదక్షిణ, మహాగణపతి పూజ, అఖండ దీపారధన, పంచగవ్య, ప్రాశన, ఆచార్య బృత్వీకరణ, దీక్షాధారణ, రక్షాబంధనమే, యాగశాల ప్రవేశం, మండల దేవతా ఆవాహనం, అంకురారోహణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

పండుగలు ఐక్యతకు నిదర్శనం

బల్మూర్: గ్రామాల్లో ఏళ్ల నాటి నుంచి కొనసాగుతున్న బొడ్రాయి పండుగలు గ్రామస్తుల మధ్య ఐక్యతకు నిదర్శనమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఇటీవల నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఐక్యమత్యంగా బొడ్రాయి ఉత్సవాలు, ప్రతిష్ఠాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మహాదేవ్‌పూర్‌లో బొడ్రాయి పండుగలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.



అవుసలికుంటలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు



మహాదేవ్‌పూర్‌లో పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురండి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న సీఈఓ



వెల్టూర్‌లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీధర్

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సింగిల్ విండో సీఈఓ ఆంజనేయులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. క్వింటాల్ రూ.1,962 చొప్పున కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా వారి పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న కల్లాల వద్దకే వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. 18వేల క్వింటాళ్ల మొక్కజొన్నను, 50వేల క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు, మొల్గరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి శ్రీధర్, తహసీల్దార్ శైలేంద్రకుమార్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంలో నాణ్యత, తేమశాతం, ధాన్యం తూకాల తీరును వారు పరిశీలించారు. తూకాల్లో ఎంత తరుగు తీస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు, ఎంఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి, ఏఈఓ భరతకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ.లక్ష ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, కాశిరెడ్డి, జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో నీరంతా వృథా అవుతుంది. వాటర్‌ట్యాంకు నుంచి మండల కేంద్రానికి సరఫరా అయ్యే పైపులైనంతా లీకేజీలమయంగా తయారైంది. పోలీస్‌స్టేషన్ వద్ద రెండు చోట్ల లీకేజీ వల్ల నీరంతా వృథాగా పోతుంది. మసీదు వద్ద లీకేజీతో నీరు రోడ్డుపైన పారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల నుంచి లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరంతా వృథా కావడంతో ప్రజలకు నీరు సరఫరాల కాక ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న మర్రిపల్లి బీటీరోడ్డు



కంకర తేలిన ఉప్పునుంతల-మర్రిపల్లి బీటీ రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కంకర తేలడంతో రోడ్డుపై గోతులు పడి బీటీ ఆనవాళ్లు ఏమాత్రం కన్పించడంలేదు. రోడ్డు సరిగా లేక ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో మండల కేంద్రం నుంచి మర్రిపల్లి, ఉప్పరిపల్లి మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి దూరం తక్కువగా ఉండి అనుకూలంగా ఉండటంతో వాహనదారులు ఎక్కువగా ఇటు నుంచే వెళ్తుంటారు. ఈ రోడ్డు అభివృద్ధికి, బీటీ రెన్యూవల్ కోసం మెయింటెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ పథకం కింద రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. గతంలో మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేయలేదు. రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. ప్రస్తుతం పనులు చేయడానికి అనుకూల సమయం ఉన్నా చేయడానికి ఆసక్తి చూపడంలేదు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డు పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



ఊర్కొండ: ఆత్మరక్షణకు కరాటే అవసరమని కరాటే, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ డూ- ఇండియా తరపున మాస్టర్ కిరణ్ నాయక్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. 25 మంది విద్యార్థులకు సిలబస్‌లను పరీక్షించారు. అనంతరం ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో గిరినాయక్, రాజయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించండి

చారకొండ: గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని డీపీఓ శ్రీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని డీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. జూన్ 2నుంచి దశాబ్ది ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించాలన్నారు. పల్లె ప్రగతిలో చేసిన అభివృద్ధిని తెలపాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ పండరీనాథ్, ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, కార్యదర్శులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న వీరనాగమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం బీజేపీ నాయకుడు దేవని సతీష్ రూ.50 వేల విరాళం అందజేశారు. వీరమ్మనాగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలాజీ, కళావతి, మంగ్యానాయక్, రేణయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో కొలువు.. పట్టణాల్లో నెలవు

- గ్రామాల్లో అందుబాటులో ఉండని ప్రభుత్వ ఉద్యోగులు

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధులు స్థానికంగా ఉండాలని నిబంధనలు ఉన్నా ఆచరణలో మాత్రం నోచుకోవడం లేదు. ఆయా శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా అధికారులు స్థానికంగా లేకపోవడంతోనే సమస్యలు యథావిధిగా ఉంటున్నాయి. పల్లెల్లో కొలువులు చేసే ఉద్యోగులు పట్టణాల్లో నెలవులుగా ఉంటున్నారు. నియోజకవర్గంలో ఆయా శాఖలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, షాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉండి రాకపోకలు కొనసాగిస్తున్నారు. కొంతమంది అచ్చంపేటలో నివాసం ఉండి ఉదయం 11 గంటలకు గ్రామాలకు వెళ్లి మళ్లి మధ్యాహ్నం 3గంటలకే పట్టణాలకు చేరుకుంటున్నారు. మరికొందరు గ్రామ స్థాయి అధికారులు పల్లెల వైపే చూడటం లేదని, చుట్టపు చూపులా వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమావేశాలు ఉన్నప్పుడు మాత్రం అన్ని శాఖల అధికారులు కన్పిస్తారని, ఆ తర్వాత ఫోన్ల ద్వారానే విషయాలను వారికి తెలియజేయాల్సి వస్తుందన్నారు.

అన్ని శాఖల అధికారులు అంతే..

రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో పాటు వార్డెన్లు, పశు సంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, స్థాయి అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటడం లేదు. చాలా మంది అధికారులు అచ్చంపేటలోనే నివాసం ఉంటూ గ్రామాలకు అడపాదడపా వెళ్తున్నారు. ఆయా శాఖలలో ఖాళీ పోస్టులు ఉండటంతో ఉన్న అధికారులు, సిబ్బందికి రెండు, మూడు గ్రామాలకు ఇన్‌చార్జీలుగా నియమించడంతో పని భారంతో గ్రామాలకు వెళ్లలేక పోతున్నారు. దీంతో గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల స్థాయిలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు సైతం హాజరు కాని అధికారులు ఉన్నారంటే వారి నిబద్ధతే నిదర్శనంగా కన్పిస్తుంది.

పాడి ఆవు మృతి

బల్మూర్: మండలంలోని బాణాల సమీపంలోని వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కేతావత్ హన్మంత్ తన వ్యవసాయ పొలంలో పశువులను మేపుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడి ఉన్న విద్యుత్ తీగలకు ఆవు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతోనే తన ఆవు బలైయిందని, విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఫీజుల వసూళ్లు అరికట్టండి

కొల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు ఫీజుల దోపిడిని అరికట్టాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల పేరుతో రూ.వేల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. బ్రాంచ్‌ల పేరుతో అనుమతులు లేకున్నా పాఠశాలలను కొత్తగా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో శేఖర్, ఫయాజ్, రుక్మత్ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నారాయణపూర్‌లో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, ఎంజీ తండా, రాచూర్‌లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లు ఎదురుచూసిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కల్వకుర్తి, చారకొండ, వెల్దండ మండలాల్లో రూ.24కోట్లతో 14బీటీ రోడ్లు వేస్తున్నట్లు వివరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో రూ.40లక్షలతో సీసీరోడ్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి, వెల్దండ, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్లకు మరో రూ.10కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి 37పల్లె దవాఖానాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్‌ఎంపీపీ శాంతి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాలను జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. తెలంగాణ ఏర్పాటు నుంచి చేసిన అభివృద్ధిని వివరించేలా ఉండాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రఘుపతిపేటకు చెందిన చంద్రయ్యకు రూ.లక్ష ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు.

సంపద వనాల కోసం స్థల పరిశీలన



కేఎల్‌ఐ ప్రాజెక్టు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ నటరాజన్

పెద్దకొత్తపల్లి: పలు రకాల పండ్ల మొక్కలతో సంపదవనాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఏపీడీ నటరాజన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కేఎల్ఐ ప్రాజెక్టు రెండవ లిఫ్టు సమీపంలో సంపద వనాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 30 ఎకరాల భూమిలో మూడు బ్లాకులు ఏర్పాటు చేసి పండ్ల మొక్కలను పెంచితే ప్రాజెక్టు సందర్శకులకు ఆకర్షనీయంగా ఉండాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది జూన్ మాసంలో ఈ సంపదవనాలలో పండ్ల మొక్కలు నాటేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏపీఓ మల్లికార్జున్, ఈసీ రామ్మోహన్, టీఏలు మణిరాం, శీనయ్య ఉన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టాలి



రైతులు ఆరబోసిన వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలో రైస్‌మిల్ యజమానులు క్వింటాల్‌కు 5 నుంచి పది కిలోలు తరుగు తీస్తున్నారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాశన్న ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఎండబెట్ల వద్ద రైతులు ఆరబోసిన వరిధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యతా, తేమ శాతాన్ని చూసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచిస్తున్నా, రైస్‌మిల్లుల యజమానులు మాత్రం రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలన్నారు. కార్యక్రమంలో విష్ణు, కుర్మయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: రైతులను ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. క్వింటాల్‌కు 6 నుంచి 15 కేజీల తరుగు తీస్తూ రైతులను దోపిడికి గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని మంతటిలో వార్లచెరువు శిఖం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ కోరారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దళితులతో కొన్న భూమి కంటే చెరువు శిఖం భూమిని అధికంగా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. దాదాపుగా ఎకరం భూమిని కబ్జా చేశారన్నారు. వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం వారి నుంచి వచ్చే మామూళ్లకు అలవాటు పడ్డారని ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుభాష్, కుర్మయ్య ఉన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలపై విస్తృత ప్రచారం



రాకొండలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

తెలకపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు చేయడంపై విస్తృత ప్రచారం చేయాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాకొండ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గర్భిణులకు అందించే వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు, గర్భిణీలకు రక్తహీనత లేకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలు, సేవలను విజయవంతం చేయాలని సూచించారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



పార్టీ జెండా ఎగరవేస్తున్న సుధాకర్‌రావు

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో ప్రజలంతా బీజేపీ వైపే చూస్తున్నారని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలత సుధాకర్‌రావు పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో చేపట్టిన ప్రజారంజక పాలనతోపాటు ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న కార్యక్రమాలు చేపట్టిన పనులపై నెల రోజుల పాటు విస్తృత ప్రచారం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థాయిలో 4 అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రతి శాసనసభ నియోజకవర్గాలతో పాటు మండలం, గ్రామ, బూత్ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక పనులపై పోరాటం చేస్తున్నామని, ప్రతి కార్యకర్త జూన్ 1వ తేది నుంచి 30వ తేది వరకు పార్టీ కోసం పనిచేయాలని, అప్పుడే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నాను. అనంతరం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్చార్జ్ మాధవి కార్యకర్తలు నెల రోజుల పాటు ఏఏ కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీపాచారి, సిద్ధారెడ్డి, కొండా మణెమ్మ, సతీష్‌మాదిగ, రామకృష్ణారెడ్డి, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, దుర్గా ప్రసాద్, నర్సింహ, నరేందర్‌రావు పాల్గొన్నారు.